క్లుప్తంగా

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరుగుతుందన్నారు. అజెండా అంశాలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఇప్పటికే అమల్లో ఉన్న కార్యక్రమాలపై శాఖల వారీ సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని చెప్పారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పోషకాహార కిట్లను అందజేస్తున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: బాలింతలు, గర్భిణులతో పాటు మహిళలందరూ పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న గర్భిణుల పౌష్టికాహారాన్ని శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉష మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భావితరాల కోసం పౌష్టికాహారం అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పథకాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతి తక్కువ ఖర్చుతో, ఎక్కువ పోషకాలు కల్గిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నేరుగా బాలింతలకు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం టీహెచ్ఆర్ పంపిణీ విధానం, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

బస్సు టైరు నుంచి పొగలు


పొగను అదుపు చేస్తున్న డ్రైవరు, కండక్టర్లు

సామర్లకోట: రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు టైరు నుంచి పొగలు వెలువడ్డాయి. స్థానికుల చొరవతో బస్సు డ్రైవరు అప్రమత్తం కావడంతో అపాయం తప్పింది. శనివారం రాజమహేంద్రవరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ వద్దకు చేరిన సమయంలో వెనుక టైరు నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే డ్రైవరు బస్సును ఆపి, ప్రయాణికులను కిందకు దింపేశారు. టైరుపై నీళ్ల పోసి, పొగలను అదుపు చేశారు.ప్రయాణికులను మరో బస్సులో కాకినాడకు తరలించారు. బస్సు చక్రం బాల్స్ పట్టేయడం వల్ల పొగలు వచ్చినట్టు డ్రైవరు శ్రీనివాసు తెలిపారు. అగ్నిమాపక, ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


పిఠాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: నియోజకవర్గంలో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జెండాను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బుర్రా వరుణ్ కృష్ణంరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని స్థాపించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ, వాజపేయి, అద్వానీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తదితరుల సేవలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం బీజేపీ నేతలు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, పసుపులేటి సత్యనారాయణ, గండి కొండలరావు, దోని అచ్యుతరామయ్య, తోట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద సమృద్ధిగా మంచినీరు

కాకినాడ: ఎన్నికలకు ముందురోజు, ఆ రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పూర్తి స్థాయిలో మంచినీటి సదుపాయం కల్పించాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై శనివారం సాయంత్రం ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో సమీక్షించారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్ల వద్ద విధి నిర్వహణలో ఉండే ఎన్నికల సిబ్బందితో పాటు, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు కూడా నీరు సమృద్ధిగా అందించాలన్నారు. ఆ మేరకు ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉన్న ఆర్వో ప్లాంట్లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన వాటర్ ప్లాంట్ల ద్వారా పోలింగ్ స్టేషన్లకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

అమ్మ రూపం.. ఆపదలకు మోక్షం..

- నేటి నుంచి కాండ్రకోట నూకాలమ్మ జాతర
- రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక
- ఏర్పాట్లు చేసిన దేవాదాయ, ధర్మదాయ శాఖ


నూకాలమ్మ అమ్మవారి ఆలయం (అంతర చిత్రం) కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు.. చాముండీ నామానికి, విశాలాక్షి పేరుకూ భయనాశినిగా ప్రఖ్యాతి చెందిన చక్కని తల్లి కాండ్రకోట నూకాలమ్మ తల్లి. ఆమె ఉగ్రరూపం వెనుక శత్రువుల్ని గడగడలాడించి, భక్తులకు వరలాచ్చే దేవతగా పేరొందిన నూకాలమ్మ అమ్మవారికి చరిత్రలో ఓ కథ ఉంది. అమ్మను చూస్తేనే ఆపదలు దూరమవుతాయన్న నమ్మకం. నమ్మిన వాళ్ల మశూచి లాంటి భయంకర వ్యాధులను అమ్మవారు మాత్రమే అరికట్టగలరన్న నమ్మకం. భక్తులకు కొండంత బలంగా విరాజిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల ఏడో తేదీ(ఆదివారం) నుంచి 45 రోజుల పాటు నిర్వహించనున్నారు.

రాక్షస సంహారిణిగా..

స్థల పురాణం ప్రకారం.. పూర్వ కాలంలో క్రూర మృగాలతో నిండిన మహారణ్య ప్రాంతంలో ఏలా మహాముని శివుణ్ని ప్రార్థిస్తూ కఠోర తపస్సు చేశాడు. ఆయన తపస్సుకు మెచ్చిన శివుడు ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. దానికి మహాముని సముద్రంలో కలవని నదిని, అందులో నీరంతా పాడి పంటలు, దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడాలని కోరాడట. దానికి శివాజ్ఞ లభించడంతో ఈ ప్రాంతంలో ఏలా ముని పేరిట ఏలేరు నది ఆవిర్భవించిందని పూర్వీకులు చెబుతున్నారు. కొంత కాలం ఈ ప్రాంతంలో కిమ్మిరుడు అనే రాక్షస రాజు పాలన నడిచేది. అతడు ప్రజలను చిత్రహింసలకు గురి చేసేవాడు. ఈ ప్రాంతానికి అతి సమీపంలో చంద్రవంశ రాజైన ధర్మకేతు మహారాజు రాజ్యం ఉండేది. కిమ్మిరుడు బారి నుంచి తమను రక్షించాలని ఇక్కడి ప్రజలు ధర్మకేతును ఆశ్రయించారు. దీంతో కిమ్మిరుడితో యుద్ధం చేసి ధర్మకేతుడు ఓటమి చెందాడు. ఈ క్రమంలో ధర్మకేతుడు పరాశక్తిని పరమనిష్ఠతో ప్రార్థించగా, అమ్మవారు ప్రత్యక్షమై ధర్మకేతుడికి హంసను ప్రసాదిస్తారు. దాని సహాయంతో మరోమారు యుద్ధం చేసి.. కిమ్మిరుడిని హతం చేస్తాడు. యుద్ధంలో సాయం చేసిన దేవతే నూకాలమ్మ అమ్మవారని, అప్పటి నుంచి అమ్మను రాజ్యాధిదేవతగా కొలిచారని చరిత్ర చెబుతోంది.

ఏటా 45 రోజుల జాతర

సుమారు 500 ఏళ్ల నుంచి కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు జాతరకు వచ్చి, మొక్కుబడులు తీర్చుంటారు. 1950లో ఈ దేవాలయం దేవదాయ, ధర్మదాయ శాఖకు అప్పగించడంతో, అప్పటి నుంచి ఏటా ఈ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆలయ కమిటీ గరగల ఉత్సవం, జాతర మహోత్సవంతో పాటు, 45 రోజుల పాటు తీరనాళ్లు నిర్వహిస్తారు. ఈ నెల ఏడు నుంచి మే 21 వరకు జాతర మహోత్సవాలను ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏడో తేదీ రాత్రి 8.36కు ప్రారంభమయ్యే జాతరకు పలువురు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

ఆలయానికి చేరాలంటే..

పెద్దాపురం పట్టణానికి ఆరు కి.మీ. దూరంలో ఉంది నూకాలమ్మ ఆలయం. రాజమహేంద్రవరం నుంచి వచ్చే యాత్రికులు స్థానిక దర్గా సెంటర్ వద్ద బస్సు దిగితే, ఆటోలు అందుబాటులో ఉంటాయి. రైలు మార్గం ద్వారా వచ్చే భక్తులు సామర్లకోట జంక్షన్‌లో దిగి, పెద్దాపురం దర్గా సెంటర్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి కాండ్రకోటకు ఆటోలు ఉంటాయి.

నేటి నుంచి నూకాలమ్మ జాతర


సామర్లకోటలో ఉన్న నూకాలమ్మ అమ్మవారు

సామర్లకోట: కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం నుంచి నెల రోజుల పాటు స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నూకాలమ్మ అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణ చేశారు. శనివారం రివాజు ప్రకారం స్థానిక బలుసులపేటలో చిన్న జాగారంగా గరగల నృత్యాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర ఉత్సవం నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకుని స్థానిక శెట్టిబలిజపేటలో జాతర ఉత్సవం నిర్వహిస్తారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో ఉన్న ఆలయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో, స్థానికులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 35 ఏళ్ల క్రితం నూతన ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ధర్మకర్తల ఆధ్వర్యంలో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

రేపు నూకాలమ్మతల్లి తీర్థం


యండపల్లిలో వేంచేసిన నూకాలమ్మతల్లి

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తీర్థం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కొత్త అమావాస్య పర్వదినాన అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దోషాలు పోవాలంటే దున్నపోతు తొక్కాల్సిందే !

- అమీనాబాద్‌లో వింత ఆచారం
- నేడు పోలేరమ్మ తల్లి తీర్థం

కొత్తపల్లి: అదోక మత్స్యకార గ్రామం. అక్కడ అమ్మవారి జాతర జరుగుతోంది. భక్తులందరూ స్నానాలు చేసి అమ్మవారి ఆలయం ముందు సాష్టాంగ పడ్డారు. ఇంతలో ఒక దున్నపోతును తీసుకువచ్చి వారిని తొక్కిస్తూ నడిపించారు. ఇదంతా చూస్తున్న వారికి ఆశ్చర్యకరమే అయినప్పటికీ అక్కడి వారికి మాత్రం అది ఆచారం. ఈ ఆచారం పాటించకపోతే గ్రామానికే అరిష్టమని అక్కడ ప్రజలు నమ్ముతారు.

పూర్వం నుంచి..

మండలంలోని అమీనాబాద్‌లో పూర్వం నుంచి ఒక ఆచారం కొనసాగుతోంది. మత్స్యకార గ్రామమైన అమీనాబాద్‌లో ఏటా పోలేరమ్మ జాతర నిర్వహిస్తారు. దీనిలో భాగంగా దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం నుంచి గ్రామస్తులు ఉపవాసం ఉంచి అమ్మవారికి పూజలు చేస్తారు. అనంతరం గరగ నృత్యాల నడుమ దున్నపోతును గ్రామమంతా ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువస్తారు. ఉపవాసం ఉన్న భక్తులందరూ పసుపునీళ్లతో స్నానం చేసి అమ్మవారి ఆలయం ఎదురుగా సాష్టాంగ పడతారు. వారిమీదుగా దున్నపోతును నడిపిస్తారు. అలా మూడు పర్యాయాలు దున్నపోతుతో తొక్కించుకుంటారు. అలా తొక్కడం వల్ల గ్రామానికి ఉన్న అరిష్టం పోవడంతో పాటు వారి కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఏటా క్రమం తప్పకుండా ఈ ఆచారాన్ని పాటిస్తుంటారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో భక్తులందరూ విశేష పూజలు చేస్తారు. గరగ నృత్యాలతో రాత్రంతా జాగారం చేస్తారు. మండలంలో నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చి ఈ వింత ఆచారాన్ని తిలకిస్తారు.


పోలేరమ్మ తల్లి



పడుకున్న భక్తులపై దున్నపోతును నడిపిస్తున్న దృశ్యం (ఫైల్)

తీర్థానికి ఏర్పాట్లు పూర్తి

అమీనాబాద్ గ్రామ దేవత పోలేరమ్మతల్లి తీర్థం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ నక్క మణికంఠబాబు తెలిపారు. శనివారం రాత్రి పోలేరమ్మతల్లి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. జాతరను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు.

సంక్షేమ పథకాలే ప్రగతి రథచక్రాలు


సామర్లకోటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దవులూరి దొరబాబు

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు

సామర్లకోట: సంక్షేమ పథకాలు పేద ప్రజల అభివృద్ధికి రథ చక్రాలు వంటివని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శనివారం స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయంలో పూజలు చేసి, ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 29, 30 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, ఆ వార్డు కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం కొనసాగింది. దీర్ఘకాలికంగా ప్రజలు స్థానిక అభ్యర్థిని కోరుకుంటున్నారని, ఈ విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తనకు పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించారని దొరబాబు తెలిపారు. సుమారు 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా స్థానిక అభ్యర్థికి అవకాశం లభించిందని, తనను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ఓటర్లను అభ్యర్థించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు. ప్రజలు ఆర్థిక సమానత్వం సాధించడమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలను వేలెత్తిచూపే ధైర్యం ఎవరికీ లేదన్నారు. చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు చేదోడువాదోడుగా ఉన్న వలంటీరు వ్యవస్థపై చంద్రబాబు అండ్ కో తప్పుడు ఆరోపణలు చేసి, అవ్వాతాతలకు ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్లు అందకుండా చేశారని దుయ్యబట్టారు. పింఛన్ల లబ్ధిదారులు మండుటెండలో సచివాలయాల వద్ద తిప్పలు పడాల్సి రావడానికి టీడీపీ నేతలే కారణమని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పి.తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం


పి.తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: గత నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో పి.తిమ్మాపురంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటా స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఎల్లప్పుడు మీ వెన్నంటే ఉండే నేను మంచి చేస్తానో.. ఎప్పుడో చుట్టపు చూపుగా వచ్చిపోయే వారు మంచి చేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఏ అవసరం వచ్చినా మాకు అందుబాటులో ఉండే మీకే మా మద్దతు, మా ఓటు అని స్థానికులు ఆమెకు భరోసా కల్పించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అడిగినా పట్టించుకోని ప్రస్తుత రోజుల్లో అడగకుండానే ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మూడు పార్టీల కూటమిలో కుమ్ములాటలు తప్ప ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏమాత్రం లేదన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి మాట్లాడుతూ మీ ఇంటి ఆడపడుచుగా కలిసిపోయి, మీకే ఏ కష్టం వచ్చినా అండగా నిలిచే వంగా గీతను గెలిపించుకుని మరింత అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పైలా నాయుడు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నా బత్తుల కామేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వంగా గీత, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా


రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

గొల్లప్రోలు: ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ పలు గ్రామాలకు చెందిన వలంటీర్ల మూకుమ్మడిగా రాజీనామ చేశారు. గొల్లప్రోలు మండలం తాడిపర్తిలో శనివారం సచివాలయం -1, 2కు సంబంధించి 53 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర కూమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఐదేళ్ల పాటు ప్రజలకు నిస్వార్థంగా సేవలందిచామన్నారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో తమను విధులకు దూరంగా ఉంచడాన్ని ఖండిస్తూ రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలను మట్టి కరిపిస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని ప్రజలకు సేవలందిస్తామన్నారు.

కళలకు ప్రాధాన్యం అవసరం

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణీదేవి, గీతా భాస్కర్

పెద్దాపురం: ప్రస్తుత సమాజంలో కళలకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో శనివారం నిర్వహించిన హరివిల్లు సంగీత, చిత్రకళ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు లలిత కళలకు ప్రాధాన్యమివ్వడం అభినందనీయమన్నారు. మరో అతిథి ప్రముఖ సినీ దర్శకుడు భాస్కర్ తల్లి గీతా బాస్కర్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, విశాఖ జిల్లాకు చెందిన చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ రామగణేష్ మాట్లాడారు. కళల వల్ల విద్యార్థులకు శారీరక, మానసిక సమస్యలు దరి చేరవన్నారు. చిన్నారుల సంగీత, చిత్రకళ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కాకినాడ క్రైం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ ఆర్‌ఎంసీ బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు విష్ణువర్ధన్, దేవీ మాధవిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మెడిసిన్ థర్డ్ ఇయర్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీజీహెచ్ ఆవరణలో ర్యాలీ నిర్వహించి, రక్తదాన కార్యక్రమం చేపట్టారు. దాతలకు సర్టిఫికెట్లు అందించారు.

ఆరోగ్య సంరక్షణలో కీలకంగా ఏఐ

కాకినాడ క్రైం: ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఓ తిరుగులేని శక్తిగా అవతరించనుందని గీతమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భవానీరావు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ బృందం పర్యవేక్షణలో జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం గ్యాలరీలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు డాక్టర్ భవానీరావు వక్తగా హాజరయ్యారు. అప్లికేషన్ ఆఫ్ ఏఐ ఇన్ మెడిసిన్ అంశంపై కీలక ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, వైద్య శాస్త్ర అనుబంధ సాంకేతిక విప్లవంలో ఏఐ కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఎన్నో దేశాల్లో వైద్య సేవల ముఖచిత్రాన్నే మార్చేసిందన్నారు. రోగులకు అత్యుత్తమ ఫలితాలు చేకూరాయని వెల్లడించారు. వైద్యంతో పాటు, కీలక శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ, నివారణ, మందుల తయారీలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


తిరుపతిలో పింఛను అందజేస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: మండలంలోని లబ్ధిదారులకు మూడు రోజుల పాటు పింఛన్లు పంపిణీ చేశామని పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని తిరుపతి, చదలాడ, చంద్రమాంపల్లి, దివిలి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ అన్ని పంచాయతీల వద్ద లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీని సమర్థంగా పూర్తి చేశామన్నారు. మూడు రోజుల వ్యవధిలో నూరు శాతం పంపిణీ పూర్తయిందన్నారు. మండలంలో 11,962 మంది లబ్ధిదారులకు గాను, రెండు రోజులకు 11,960 మందికి పింఛన్లు అందజేశామని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొంతమంది లబ్ధిదారులకు ఆమె పింఛన్లు అందజేశారు. చదలాడ పాండురంగ స్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, భార్గవ్, జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.